30|04|2026





నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి

పనిచేయాలనే పట్టుదల, విజయ తీరాలకు చేరుస్తుంది. ఒకప్పుడు తెలుగు భాషకు కేంద్రమై, తర్వాత కాలంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ఆ ప్రాంతంలో తెలుగు భాషకు అంతగా ప్రాధాన్యం లభించని పరిస్థితుల్లో ఒకవైపు వివాహం చేసుకొని, కుటుంబాన్ని నడిపిస్తూనే ఉన్నతవిద్యను అభ్యసించి తన నాలుగు పదుల వయసులో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలుగా చేరారు. దేశవ్యాప్తంగా తన భాషాపరిజ్ఞానంతో వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. తనదైన ప్రత్యేకతతో పరిశోధనలు చేస్తూనే, విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణగా నిలిచారు. ఆమె పేరే ఆచార్య డి. విజయలక్ష్మి. పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం....

# విజయతీరాల్ని... చేరడానికి వయసుతో పనిలేదు

హైదరాబాద్ విశ్వవిద్యాలయ భాషాశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా సేవలందిస్తున్న ప్రొఫెసర్ డి. విజయలక్ష్మి తెలుగు భాషా పరిశోధనలో విశిష్టమైన గుర్తింపు పొందారు. ఆమె తన సుదీర్ఘ బోధనా వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా, భాషా విజ్ఞానం, తులనాత్మక భాషాశాస్త్ర రంగాల్లో అనేక పరిశోధనలు చేశారు. తెలుగు భాషా ప్రాచీనతను, దాని పరిణామక్రమాన్ని విశ్లేషించడంలో ఆమె చేసిన కృషి ప్రశంసనీయం. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పలు పరిశోధనా పత్రాలను సమర్పించిన ఆచార్య డి. విజయలక్ష్మి గారు, అకడమిక్ రంగంలో నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ భాషాభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఒక నిబద్ధత గల అధ్యాపకురాలిగా, నిశిత పరిశోధకురాలిగా విద్యా ప్రపంచంలో ఆమెకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఆచార్య డి. విజయలక్ష్మి గారు తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా, పొన్నేరి తాలుకా, మీంజూరు పంచాయతీ పరిధిలోని రామారెడ్డిపాలెంలో దేవారెడ్డి యుగంధర్, పిచ్చమ్మ దంపతులకు నాల్గవ సంతానంగా జన్మించారు. పటిష్టమైన కుటుంబ వ్యవస్థ పట్ల ప్రీతి, సామాజిక జీవన దర్శనం, తారతమ్య భేదం లేని కలివిడితనం ఆమె వ్యక్తిత్వంలోని విశేషాలు.

## విద్యాభ్యాసం - ఉద్యోగం:

ఆచార్య డి. విజయలక్ష్మి గారు తన స్వగ్రామంలో ప్రాథమిక విద్యను, మీంజూరులో ఉన్నత విద్యను, పొన్నేరిలో పి.యు.సి (డిగ్రీ) పూర్తి చేశారు. చదువుపై ఉన్న మక్కువతో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగులో చేరారు. ఇంట్లో వాళ్ళు వారించినా పట్టుదలతో పిహెచ్.డి. వరకు చదువు కొనసాగించారు. ఉద్యోగ వేటలో ఎన్నో సవాళ్లను, అవమానాలను ఎదుర్కొని, తన 42వ ఏట హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా చేరారు. పరిశోధక విద్యార్థి దశ నుంచే పాఠాలు చెప్పడం ప్రారంభించిన ఆమె, అడ్ హాక్ లెక్చరర్గా, పార్ట్ టైం ఫ్యాకల్టీగా, ప్రాజెక్టు ఫెలోగా చాలీచాలని జీతంతోనే వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తూ ఆర్థిక ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఎం.ఏ. చదువుకునే రోజుల్లోనే భాషాశాస్త్రం పట్ల మక్కువ పెంచుకున్న ఆమె, నిరంతర సాధనతో ఆ రంగంలో పట్టు సాధించారు. తెలుగు మాండలికాలు, అనువాద రూపాలు, ద్రావిడ పద వ్యుత్పత్తులు, సాంస్కృతిక పదజాలంపై ఆమెకు ప్రత్యేక ఆసక్తి ఉంది. వీటి ఆనుపూర్వాలను ఆలోచించి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా వికాసం, తులనాత్మక ద్రావిడ భాషలు, తెలుగు మాండలికాలు, నిఘంటు నిర్మాణ శాస్త్రం, అనువాదం, తెలుగు సంస్కృతి-చరిత్ర, జానపద సాహిత్యం వంటి కోర్సులను బోధిస్తున్నారు.

## భాషాశాస్త్ర ఆచార్యులు డి. విజయలక్ష్మి జీవితం

ఆమె పర్యవేక్షణలో ఇప్పటివరకు 10 మంది విద్యార్థులు పిహెచ్.డి.లు, 19 మంది విద్యార్థులు ఎం.ఫిల్.లు పూర్తి చేశారు. ప్రస్తుతం మరో 8 మంది విద్యార్థులు ఆమె మార్గదర్శకత్వంలో పరిశోధనలు చేస్తున్నారు. సామాజిక అంశాలపై కూడా ఆమె పరిశోధనలు చేయించారు. విజయలక్ష్మి గారి సొంత ప్రచురణలు, టీమ్ వర్క్ ప్రచురణలు కలిపి మొత్తం 9 పుస్తకాలు వెలువడ్డాయి. ఇవి కాకుండా వివిధ పత్రికల్లో, సెమినార్ ప్రొసీడింగ్లో 32 వ్యాసాలు ముద్రితమయ్యాయి. అలాగే 94 జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పరిశోధనా పత్రాలను సమర్పించారు.













## ముఖ్యమైన ప్రాజెక్టులు:

- Proficiency Test Materials in Telugu – CIIL ప్రచురణ (టీమ్ వర్క్).
- వాచక నిర్మాణం (Primer–I) – హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రచురణ (టీమ్ వర్క్).
- వాచక నిర్మాణం (Primer–II) – హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రచురణ (టీమ్ వర్క్).
- బోధకుల దీపిక – హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రచురణ (టీమ్ వర్క్).

## తమిళనాడులో తెలుగు:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని తమిళనాడు జిల్లాలైన కృష్ణగిరి, ఆర్కాడు, చెంగల్పట్టు, మద్రాసు ప్రాంతాల్లోని తెలుగుభాషా స్వరూపాన్ని ఆమె లోతుగా అధ్యయనం చేశారు. అక్కడి తెలుగు భాషా పరిణామాలను, మాండలిక వైవిధ్యాన్ని పరిశీలించడమే కాకుండా, మన రాష్ట్రంలో కనుమరుగైన ప్రాచీన తెలుగు పదాలు అక్కడ ఎలా సజీవంగా ఉన్నాయో విశ్లేషించారు. తమిళనాడులోని తెలుగు వారి భాషా – సాంస్కృతిక జీవన విధానంపై ఆమె చేసిన UGC–MRP (Major Research Project) అద్భుత ఫలితాలను అందించింది.

## రాయలసీమ వాడుక మాటలు - నిఘంటు నిర్మాణం:

రాయలసీమ ప్రాంతంలోని ఐదు జిల్లాల మాండలికతను ప్రమాణంగా తీసుకుని ఈ ప్రాజెక్టును నిర్వహించారు. భద్రిరాజుకృష్ణమూర్తి గారి అభిప్రాయం ప్రకారం నెల్లూరులో కొంత భాగం కూడా రాయలసీమ మాండలిక పరిధిలోకి వస్తుంది. ఆ ప్రాతిపదికన ఆయా ప్రాంతాల భాషా స్వరూపాన్ని, వ్యాకరణాంశాలను అధ్యయనం చేసి, రాయలసీమ ప్రాంతం ప్రాచీన భాషా రూపాలను కలిగి ఉందని ఆమె నిరూపించారు.

మైసూరులోని భారతీయ భాషా సంస్థాన్ (CIIL)తో ఆమెకు సుదీర్ఘ అనుబంధం ఉంది. 1996 నుండి నిఘంటు నిర్మాణ శాస్త్రంపై అనేక శిక్షణ శిబిరాల్లో పాల్గొని మెటీరియల్ అందించారు. మలయాళం–తెలుగు నిఘంటు నిర్మాణంలోనూ తన వంతు సేవలు అందించారు. అలాగే 'Linguistic Survey of India' కోసం నిర్వహించిన సమ్మర్ స్కూల్లో భాషానుక్రమణికపై శిక్షణ పొందారు. CDL (Center for Distance Education) ద్వారా తెలుగేతరులకు తెలుగు నేర్పేందుకు 40 పాఠాలను రూపొందించారు.

## తెలుగు మాండలిక & తులనాత్మక అధ్యయనం:

తెలుగు మాండలికాలు ఆమెకు అత్యంత ఇష్టమైన అంశం. విద్యార్థుల్లో భాషా పరిశీలన పట్ల అభిరుచి కలిగేలా ఆమె బోధన సాగుతుంది. ప్రస్తుతం అనేక విశ్వవిద్యాలయాల్లో ద్రావిడ భాషా బోధన తగ్గుముఖం పట్టినప్పటికీ, విజయలక్ష్మి గారికి తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషలపై ఉన్న అవగాహన వల్ల ఆమె బోధనా శైలి వినూత్నంగా ఉంటుంది. ధ్వని మార్పులను, ధ్వని సూత్రాలను నిఘంటువుల ఆధారంగా సేకరించిన కొత్త పదాలతో అన్వయించి ఆమె వివరిస్తారు.

## సామాజిక భాషా శాస్త్రవేత్తగా:

భాషను సమాజంతో ముడిపెట్టి ఆలోచించాలనేది ఆమె దృక్పథం. 'తెలుగు–తమిళ భాషల్లో లాలిపాటలు – సామాజిక భాషా విశ్లేషణ' అనే ఆమె పిహెచ్.డి. పరిశోధనలో ఈ అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. తెలుగు, తమిళ సమాజాల్లోని కుటుంబ సంబంధాలు, ఆచారాలు, దైవ ప్రార్థనల్లోని సారూప్యతలను, వైవిధ్యాలను ఆమె తులనాత్మకంగా విశ్లేషించారు.














## బోధనా విధానం & వ్యక్తిత్వం:

ఆచార్య డి. విజయలక్ష్మి గారు కేవలం పాఠ్యాంశాలనే కాకుండా, జీవిత పాఠాలను కూడా నేర్పే గురువు. విద్యార్థులకు, ముఖ్యంగా విద్యార్థినులకు ఆమె గొప్ప ప్రేరణ. "ఆడపిల్ల కంటినీరు నేలపడితే దేశానికి అరిష్టం" అనే సూక్తిని గుర్తు చేస్తూ, మహిళలు ధైర్యంగా, స్వతంత్రంగా ఉండాలని ఆమె ఆకాంక్షిస్తారు. గొప్ప భాషావేత్తగా, సామాజిక శాస్త్రవేత్తగా, కౌన్సిలర్గా ఆమె విద్యార్థుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.



డి. సాయినాథ్ రెడ్డి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
6305584064.

నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి









# అజరామరుడు తాళ్లపాక అన్నమయ్య




"అదివో అల్లదివో శ్రీహరి వాసము
పదివేల శేషుల పడగల మయము."

"అలర చంచలమైన ఆత్మలందుండ
నీ యలవాటు చేసె నీవుయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ
భావంబు దెలిపె నీ వుయ్యాల "

"క్షీరాబ్ధి కన్యకకు శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం"

"జోఅచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామ గోవింద "

హెచ్ సి యు తెలుగు శాఖ అధ్యక్షులు
ఆచార్య పిల్లలమర్రి రాములు

## హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అన్నమయ్యపై అంతర్జాతీయ సదస్సు

**హైదరాబాద్, (నినాదం):**

తెలుగు సంకీర్తనా సాహిత్యానికి అన్నమయ్య ప్రథమాచార్యుడని, పదకవితా పితామహుడిగా సంగీతం, నృత్య కళలను సాహిత్యానికి అందించిన ప్రథమ వాగ్గేయకారుడిగా నిలిచిన అజరామరుడు తాళ్లపాక అన్నమయ్య అని తెలుగు సాహిత్యానికి, భక్తి మార్గా నికి ఆయన చేసిన సేవ సాటిలేనిదన్నారు. హెచ్ సి యు తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు అన్నమయ్యకు కైమోడ్పులు ఘటించారు. బుధవారం నాడు హైదరాబాద్ యూనివర్సిటీ తెలుగు శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య ప్రాజెక్టు వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు 'తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు–భాష, సాహిత్యం, సంగీతం, నృత్యం 'అనే అంశంపై జరిగిన సదస్సుకు అధ్యక్షత వహిస్తూ, ఆయన కీలకోపన్యాసం చేశారు. తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ అన్నమయ్య సాహిత్యంలోని సామాజిక అంశాలను ప్రస్తావిస్తూ, అన్నమయ్యపై పద్యాలను రచించి సభలో చదివి వినిపించారు.

సదస్సు కన్వీనర్ ఆచార్య డి. విజయలక్ష్మి సదస్సు లక్ష్యాలను వివరిస్తూ అన్నమయ్య సాహిత్యంలో కేవలం భక్తి మాత్రమే కాదని, భాషా ప్రయోగాలు, సామాజిక అంశాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆచార్య ఎం. గోనానాయక్ మాట్లాడుతూ హాతీరామ్ జీ బంజారా భాషలో సుమారు 150 కీర్తనలను రచించినట్లు ఆయన తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంగీత నృత్య కళల విభాగ అధ్యక్షులు ఆచార్య ఆర్ ఎన్ ఎస్ శైలేశ్వరి సాహిత్యానికి సంగీత పరంగా సంకీర్తనలు రచించిన మొట్టమొదటి వాగ్గేకారుడుగా అన్నమయ్య గురించి సోదాహరణంగా వివరించారు.
ఈ సదస్సులో ఆచార్యులు పమ్మి పవన్ కుమార్, పి.వారిజారాణి, త్రివేణి వంగరి, రెడ్డి శ్యామల, భూక్య తిరుపతి, సాగి కమలాకరశర్మ, డా.బి.భుజంగరెడ్డి, డా.ఎస్.రఘు, డా.పి.విజయ్ కుమార్, డా.బాశెట్టి లత, తిరుమల తిరుపతి దేవస్థానం నుండి భాగవతార్ రమేష్, రెడ్డయ్య, సుశీల్ ఆండాళ్, విజయ్, మురళీ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి డాక్టర్ పి. విజయ్ కుమార్ స్వాగతం పలుకగా, డాక్టర్ బాశెట్టి లత వందన సమర్పణ చేశారు. సదస్సు అనంతరం సంగీత కార్యక్రమాలు జరిగాయి. ఈ సదస్సులో పరిశోధక విద్యార్థినీ, విద్యార్థులు, స్నాతక, స్నాతకోత్తర విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

















మొదటి సమావేశానికి ఆచార్య పమ్మి పవన్ కుమార్, అధ్యక్షత వహించారు. ఆచార్య శైలేశ్వరి అన్నమయ్య సంకీర్తనలు స్వరపరిచిన సంగీత విద్వాంసుల రీతులు అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. అనంతరం ఆచార్య రెడ్డి శ్యామల అన్నమయ్య క్రియారంబ సంకీర్తనలు శైలి విన్యాసంపై ప్రసంగించారు.



రెండవ సమావేశానికి ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, అధ్యక్షత వహించారు. ఆచార్య సాగి కమలాకర శర్మ అన్నమయ్య సంకీర్తనలు వైరభక్తి అనే అంశంపై మాట్లాడారు. అనంతరం డా. ఎస్. రఘు అన్నమయ్య సంకీర్తనలు జీవన తాత్వికత గురించి తెలియజేశారు. డా. పి. విజయకుమార్ అన్నమయ్య సంకీర్తనలలో అభ్యుదయ దృక్పథం అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు.



మూడవ సమావేశం ఆచార్య వంగరి త్రివేణి, అధ్యక్షులు అన్నమయ్య సంకీర్తనలు – దాసతత్త్వం అనే అంశం పై పత్రాన్ని సమర్పించారు. అనంతరం డా. టి. ఎస్. ప్రతిమ, డా. సుభాషిణి, రాకేశ్ తమ పత్ర సమర్పణలు చేశారు.



నాలుగవ సమావేశం (అంతర్జాలం) నాలుగవ సమావేశానికి ఆచార్య పి. వారిజారాణి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆచార్య కోలవెన్ను మలయవాసిని, డా. దేవగుప్తపు కనకం, డా.సునీత, డా. లక్ష్మీనారాయణ, రాంబట్ల పార్వతీశ్వర శర్మ తదితరులు పత్ర సమర్పణ చేశారు.



